




DD9 వార్త
తెలుగు దినపత్రిక

# బీజేపీతోనే అభివృద్ధి.. భద్రత

బెంగాల్ ఎన్నికల వేళ అమిత్ షా ప్రకటనలు
టీఎంసీపై తీవ్ర విమర్శలు, భారీ హామీలు
తొలి విడత పోలింగ్‌కు
ముందే వేడెక్కిన ప్రచారం
టీఎంసీ ప్రభుత్వంపై
అమిత్ షా తీవ్ర విమర్శలు
రామమందిరం–
బాబ్రీ మసీదు వ్యాఖ్యలతో కొత్త వివాదం
యువతకు ప్రతి ఏడాది లక్ష ఉద్యోగాల హామీ
యూనిఫాం సివిల్ కోడ్‌పై కీలక ప్రకటన
మమతా కుటుంబ రాజకీయాలపై ఆరోపణలు
మహిళల భద్రత అంశంపై దుమారం
గూర్ఖా సమస్య పరిష్కారంపై హామీ



సంపుటి : 02 సంచిక : 242 హైదరాబాద్, ఏప్రిల్, బుధవారం 22, 2026 పేజీలు : 06 వెల : 3.00

# ఢిల్లీకి వెళ్లడం తప్పా?

రేవంత్ కుట్రలు అడ్డుకొనేందుకే వెళ్లాను
నేను బాజాప్తా ఢిల్లీకి పోయిన.. సీక్రెట్ ఏమీ లేదు
సీనియర్ లాయర్లతో సమావేశాలపై స్పష్టీకరణ
కాళేశ్వరం కేసులపై న్యాయపరమైన చర్చలు జరిపాను
ఓటుకు నోటు కేసు విచారణపై కీలక వ్యాఖ్యలు
సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు ఆరోపణలు
మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ సూచన మేరకే తాను ఢిల్లీ పర్యటనకు వెళ్లినట్లు మాజీ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించిన కేసులు, ఓటుకు నోటు కేసు వంటి కీలక అంశాలపై సీనియర్ న్యాయవాదులతో చర్చించేందుకు ఈ పర్యటన చేపట్టినట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు విస్తృతంగా మాట్లాడారు.
ఢిల్లీ పర్యటన ఉద్దేశ్యంపై వస్తున్న విమర్శలకు సమాధానంగా హరీశ్‌రావు స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెట్టే అక్రమ కేసులను ఎదుర్కొనేందుకు ముందస్తుగా న్యాయపరమైన సలహాలు తీసుకోవడం అవసరమని అన్నారు. ఈ నేపథ్యంలోనే దేశంలో పేరున్న న్యాయవాదులతో సమావేశమయ్యామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై నమోదవుతున్న కేసుల విషయంలో సుదీర్ఘ చర్చలు జరిగినట్లు హరీశ్‌రావు వెల్లడించారు. ప్రాజెక్ట్‌పై ప్రభుత్వం

..మిగతా 2లో






# హైలెవల్ బ్రిడ్జిపై కాంగ్రెస్, బీజేపీ మధ్య
# మాటల యుద్ధం

జూరాల డ్యామ్ భద్రతపై ఇంజినీర్ల ఆందోళన
కిలోమీటర్ దిగువన హైలెవల్ బ్రిడ్జి కట్టి ట్రాఫిక్ డైవర్షన్‌కు ప్లాన్
2025 జూన్‌లో పరిపాలనా పరమైన అనుమతులు
డ్యామ్‌కు దిగువన 11కి.మీ. దూరంలో కొత్త బ్రిడ్జికి ప్రతిపాదన
శంకుస్థాపనతోనే క్రెడిట్ ఫైట్ మొదలు కాంగ్రెస్-బీజేపీ మధ్య మాటల యుద్ధం
డ్యాం భద్రతా? రాజకీయ ప్రయోజనాలా? బ్రిడ్జి చుట్టూ సందేహాల మబ్బు
ధరూరు–అమరచింత మధ్య కృష్ణా నదిపై ప్రతిపాదిత వంతెనకు అడ్డంకులేనా?
టెక్నికల్ క్లియరెన్స్‌లపై ప్రశ్నలు... ప్రాజెక్ట్ ముందుకు సాగుతుందా?
మాటల తూటాలు ఇక్కడితో ఆగుతాయా? లేక నిర్మాణం ఆపేదాకా పోరాటమా?

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
హైలెవల్ బ్రిడ్జి చుట్టూ హైటెన్షన్ పాలిటిక్స్ నడుస్తున్నాయా? శంకుస్థాపన రాయి పడీ పడగానే... పొలిటికల్ పిడకల వేట మొదలైపోయిందా? కాంగ్రెస్, బీజేపీ నువ్వా నేనా అన్నట్టు పావులు కదుపుతున్నాయా? ప్రస్తుతం పేలుతున్న మాటల తూటాలు ఇక్కడితో ఆగుతాయా? లేక వంతెన నిర్మాణాన్ని ఆపేదాకా వెళ్తాయా? ఎక్కడ జరుగుతోంది ఆ తంతు? ఏ బ్రిడ్జి విషయంలో జరుగుతోంది? తెలంగాణలోని కీలక ప్రాజెక్టుల్లో

..మిగతా 2లో



# రేవంత్ రెడ్డి సీమాంధ్ర నేతల చేతుల్లో కీలుబొమ్మ

2015లో టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే కుట్రతో ఓటుకు నోటు కేసులో దొరికిపోయారని ఆరోపణ
మేం పాలన మార్పు కోరుకుంటున్నాం కానీ రేవంత్ రెడ్డికి కీడు జరగాలని కోరుకోవడం లేదని వ్యాఖ్య
కేసీఆర్ లేకుంటే ఆయన ముఖ్యమంత్రి అయ్యేవాడా అని ప్రశ్న

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రా నాయకులకు తొత్తుగా మారిపోయారని నిన్న బీఆర్ఎస్ పార్టీలో చేరిన జగిత్యాల సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి విమర్శించారు. ఆయన మొదటి నుంచి సీమాంధ్ర నాయకుల చేతిలో కీలుబొమ్మగానే ఉంటున్నారని అన్నారు. 2015లో నాటి టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే కుట్రతో, వేం నరేందర్ రెడ్డిని ఎమ్మెల్సీగా చేయాలనే ఉద్దేశంతో ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి దొరికిపోయారని పేర్కొన్నారు. ఆయనకు రాజ్యాంగం పట్ల గౌరవం లేదని విమర్శించారు. ఆయన ఆంధ్రా తొత్తులా మారి పోలవరం ప్రాజెక్టు

..మిగతా 2లో

# తెలంగాణలో యువత అంతా ఏమైంది?
# 75 ఏళ్ల వ్యక్తి నవ యువకుడా?

ఈ నెల 25న కొత్త రాజకీయ పార్టీని ప్రకటించనున్న కల్వకుంట్ల కవిత
మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు
యూత్ రాజకీయాల్లోకి రావాలంటూ జాగృతి అధ్యక్షురాలు పిలుపు
తన పార్టీలో యువతకు ఉద్యమకారులకు పెద్దపీట వేస్తామని వ్యాఖ్య
జీవన్ రెడ్డి చేరికపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టిన కవిత
ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటన

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పార్టీలకు ప్రత్యామ్నాయంగా నిలిచేందుకు జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ ప్రస్థానానికి ముహూర్తం ఖరారు చేశారు. ఈ నెల 25న మేడ్చల్ జిల్లా మునీరాబాద్ వేదికగా కొత్త రాజకీయ పార్టీని

..మిగతా 2లో



# ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

మంత్రి కోమటిరెడ్డి ఆదేశాలు
యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు పెంచాలని ఆదేశాలు
అన్ని కొనుగోలు కేంద్రాలకు లారీలు అందుబాటులో ఉంచాలని సూచన
ధాన్యం ఎక్కువగా వచ్చే గ్రామాలకు అదనపు వాహనాల పంపిణీ
రోడ్లపై ధాన్యం పోకుండా ప్రత్యామ్నాయ కేంద్రాల ఏర్పాటు
కొత్త రేషన్ కార్డులతో కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ
గత ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేసిన మంత్రి
ధాన్యం నిల్వల్లో భారీ కుంభకోణం జరిగిందన్న ఆరోపణ
నల్గొండ జిల్లాలో కేసులు నమోదు చేసినట్లు వెల్లడి



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
రబీ సీజన్‌లో ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు పరిస్థితులపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమీక్ష సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ధాన్యం కొనుగోళ్లు యుద్ధ ప్రాతిపదికన

..మిగతా 2లో

# విభజనపై విషం చిమ్మొద్దు

చంద్రబాబుకు మంత్రి పొన్నం బహిరంగ లేఖ
బీజేపీ, టీడీపీ, జనసేన నేతల వ్యాఖ్యలపై అభ్యంతరం
విభజనను తప్పుగా చిత్రీకరించడం సరికాదన్న మంత్రి
విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు ఉన్నాయని ఆందోళన
ఎంపీ తేజస్వి వ్యాఖ్యలపై స్పీకర్‌కు లేఖ రాయాలని విజ్ఞప్తి
లోక్‌సభ రికార్డుల నుంచి వ్యాఖ్యలు తొలగించాలన్న డిమాండ్
రెండు రాష్ట్రాలు కలిసి అభివృద్ధి దిశగా నడవాలన్న పిలుపు
నాయకులు బాధ్యతాయుతంగా మాట్లాడాలని సూచన
సమస్యపై తగిన చర్యలు తీసుకుంటారని ఆశాభావం

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
రాష్ట్ర విభజన అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించడం ఎవరికీ మేలు చేయదని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్

..మిగతా 2లో



# రేవంత్ 'రాహువు'.. కేసీఆర్ 'కేతువు

కాళేశ్వరం ప్రాజెక్టు కాంగ్రెస్, బీజేపీలకు ఏటీఎం
అవినీతి వ్యవహారంపై బండి సంజయ్ ప్రశ్నల వర్షం
రేవంత్ మెతక వైఖరి అవలంబిస్తున్నారు
కేసీఆర్ కుటుంబంపై చర్యలు ఎందుకు తీసుకోరు
రేవంత్ రాసిన లేఖల అసలు ఉద్దేశ్యంపై సందేహాలు
మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ పార్టీ అడ్డుకున్నది
కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌లపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాలపై విస్తృతంగా స్పందించిన ఆయన, ఇద్దరు నేతల భాష, విధానాలను తీవ్రంగా తప్పుబట్టారు. రేవంత్‌రెడ్డిని 'రాహువు', కేసీఆర్‌ను 'కేతువు'గా వ్యాఖ్యానిస్తూ

..మిగతా 2లో





# కేంద్ర నిధులపై చర్చకు సిద్ధమా?

**రేవంత్, కేసీఆర్ లకు రాంచందర్ రావు సవాల్**

తెలంగాణకు గత పదేళ్లలో కేంద్రం రూ. 12 లక్షల కోట్లు ఇచ్చిందన్న రాంచందర్ రావు
రేవంత్, కేసీఆర్ ఎక్కడకు వచ్చినా చర్చకు తాను సిద్ధమని వ్యాఖ్య
హరీశ్ రావు తమతో ఎలాంటి రాయబారాలు నడపడం లేదని స్పష్టీకరణ



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణ అభివృద్ధికి మోదీ ప్రభుత్వం అందించిన నిధుల విషయంలో తాము చర్చకు ఎప్పుడూ సిద్ధమేనని రాష్ట్ర బీజేపీ చీఫ్ రాంచందర్ రావు స్పష్టం చేశారు. గత పదేళ్లలో కేంద్రం తెలంగాణకు రూ. 12 లక్షల కోట్లు ఇచ్చిందని, కేవలం గత రెండేళ్లలోనే రూ. 1.5 లక్షల కోట్లు కేటాయించిందని గణాంకాలతో వివరించారు.
కేంద్రం ఇచ్చిన నిధులపై చర్చించేందుకు సీఎం రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎక్కడికి వచ్చినా తాను చర్చకు

..మిగతా 2లో

# ఢిల్లీకి వెళ్లడం తప్పా?

మొదటిపేజీ తరువాయి



చేస్తున్న ఆరోపణలను న్యాయపరంగా ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలపై చర్చించామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జరుగుతున్న విమర్శలు రాజకీయ ప్రేరేపితమని ఆయన అభిప్రాయపడ్డారు.

ఓటుకు నోటు కేసుపై కూడా హరీశ్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు త్వరలో సుప్రీంకోర్టులో విచారణకు రానుందని పేర్కొన్నారు. ఆ విచారణ నేపథ్యంలోనే న్యాయవాదులతో సమావేశమై కేసు వివరాలపై చర్చించామని తెలిపారు.

ఈ కేసులో అప్పటి ముఖ్యమంత్రి, హోం మంత్రి కూడా ఇంప్లీడ్ అయ్యారని ఆయన గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసును ఎలా ముందుకు తీసుకెళ్తుందన్న దానిపై అనుమానాలు వ్యక్తం చేశారు. హోంశాఖ తరపున అనామక న్యాయవాదిని నియమించడం సరైన విధానం కాదని విమర్శించారు.

ఇక నిందితుల తరపున ప్రముఖ న్యాయవాది ముకుల్ రోహత్గీని నియమించడాన్ని కూడా హరీశ్‌రావు ప్రస్తావించారు. ఈ నియామకం వెనుక ఉద్దేశ్యం ఏమిటో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసు ప్రాముఖ్యత దృష్ట్యా పారదర్శకత అవసరమని పేర్కొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డిపై కూడా హరీశ్‌రావు తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటుకు నోటు కేసులో ప్రస్తుత ముఖ్యమంత్రి ముద్దాయిగా ఉన్నారని, గత నాలుగున్నరేళ్లుగా స్టే మీద కొనసాగుతున్నారని అన్నారు. ఈ అంశంపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఢిల్లీ పర్యటన సందర్భంగా రేవంత్ రెడ్డి రాజకీయంగా వివిధ నేతలను కలుస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఒకవైపు కాంగ్రెస్ నేతలతో, మరోవైపు భాజపా నేతలతో సమావేశాలు నిర్వహించడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో ప్రజలకు తెలియజేయాలని అన్నారు.

రైతు భరోసా అంశంపై కూడా హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ బయటకు వచ్చిన వెంటనే ప్రభుత్వం రెండో విడత రైతు భరోసా విడుదల చేసిందని అన్నారు. ఇది రాజకీయ ఒత్తిడితో తీసుకున్న నిర్ణయమని విమర్శించారు. పంట పెట్టుబడిగా ఇవ్వాల్సిన సహాయం పంట చేతికి వచ్చిన తర్వాత ఇవ్వడం వల్ల రైతులకు పెద్దగా ప్రయోజనం లేదని పేర్కొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను హరీశ్‌రావు ఖండించారు. ప్రాజెక్ట్ పూర్తిగా కూలిపోయిందని ఇన్నాళ్లు దుష్ప్రచారం చేశారని, ఇది నిజానికి విరుద్ధమని అన్నారు. ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని తగ్గించేందుకు కావాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

మొత్తంగా హరీశ్‌రావు చేసిన ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. కాళేశ్వరం ప్రాజెక్ట్, ఓటుకు నోటు కేసు, రైతు భరోసా వంటి అంశాలపై ఆయన చేసిన ఆరోపణలు రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత తీవ్రం కానున్నదని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## తెలంగాణ యువత అంతా ఏమైంది?..
# 75 ఏళ్ల వ్యక్తి నవ యువకుడా?

మొదటిపేజీ తరువాయి

లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఆమె అధికారికంగా ప్రకటించారు. తన కొత్త పార్టీలో యువతకు, తెలంగాణ ఉద్యమకారులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల తీరుపై, ముఖ్యంగా మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యలపై ఆమె తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

జగిత్యాలలో సోమవారం జరిగిన బీఆర్ఎస్ సభలో సీనియర్ నేత జీవన్ రెడ్డి ఆ పార్టీలో చేరారు. ఈ సభలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను కవిత తీవ్రంగా తప్పుబట్టారు. 75 ఏళ్ల కురు వృద్ధుడిని పార్టీలో చేర్చుకుని, ఆయనకు 25 ఏళ్లు తగ్గిపోయాయని, నవ యువకుడిగా అద్భుతాలు చేస్తారని కేసీఆర్ పొగడటం హాస్యాస్పదమన్నారు. అలాంటప్పుడు రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగ యువకులు ఏమవ్వాలని ఆమె ప్రశ్నించారు. యువత ఆకాంక్షలను గుర్తించడంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పచ్చి తెలంగాణ వ్యతిరేకి అయిన జీవన్ రెడ్డిని పార్టీలో చేర్చుకుని, తెలంగాణ పునర్నిర్మాణం గురించి మాట్లాడటం దారుణమన్నారు.

బీఆర్ఎస్ పార్టీ ఉట్టి కథలు చెబుతుంటే, అధికార కాంగ్రెస్ పార్టీ పిట్ట కథలు చెబుతోందని, కానీ ఏ ఒక్కరూ ప్రజల కష్టాల గురించి మాట్లాడటం లేదని కవిత విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించి ప్రజలు తప్పు చేశారని కేసీఆర్ అనడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. ప్రజల తీర్పును గౌరవించాల్సింది పోయి వారిని తప్పుబట్టడం సరికాదన్నారు. బీఆర్ఎస్ సభలో బీజేపీని పల్లెత్తు మాట అనలేదని, మహిళా రిజర్వేషన్ల ఊసే ఎత్తలేదని ఆమె మండిపడ్డారు. రాజకీయ పునరేకీకరణ పేరుతో ఆ పార్టీ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తోందని దుయ్యబట్టారు.

కొత్త పార్టీ ప్రకటన నేపథ్యంలో నగరవ్యాప్తంగా ఫ్లెక్సీలు, బ్యానర్ల ఏర్పాటు విషయంలో జీహెచ్ఎంసీ అధికారులు సహకరించాలని, అడ్డంకులు సృష్టించవద్దని కవిత కోరారు. ప్రజాస్వామ్యంలో కొత్త శక్తులు ఎదిగేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో తమ సమస్యల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు తలపెట్టిన సమ్మెకు కవిత తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ప్రజల గొంతుకగా నిలిచేందుకే తాను నూతన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆమె వెల్లడించారు.

# రేవంత్ రెడ్డి సీమాంధ్ర నేతల చేతుల్లో కీలుబొమ్మ

మొదటిపేజీ తరువాయి



నిర్మాణానికి సహకరిస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలన పోయి కేసీఆర్ పాలన రావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. మేం పాలన మార్పు కోరుకున్నాం తప్ప, భౌతికంగా రేవంత్ రెడ్డి కీడును తాము కోరుకోలేదని అన్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యారంటే అది కేసీఆర్ పుణ్యమే అన్నారు. కేసీఆర్ ఉద్యమించకుంటే తెలంగాణ వచ్చేదా అని ప్రశ్నించారు. అలాంటి ఉద్యమనాయకుడిని పట్టుకుని ఉరితీస్తానని అంటావా అని ప్రశ్నించారు.

జగిత్యాలలో కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ సమయంలోనే రేవంత్ రెడ్డి కావాలని మేడిగడ్డ పర్యటనను పెట్టుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదని, కానీ రేవంత్ రెడ్డి తానే ఎప్పటికీ ముఖ్యమంత్రిగా ఉంటానని చెబుతున్నాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం అన్నీ గమనిస్తోందని తెలిపారు. రేవంత్ రెడ్డి ఇప్పటికే బీజేపీలో చేరారని... ఎన్డీఏకు, రేవంత్ రెడ్డికి మధ్య చంద్రబాబు వారధిగా ఉన్నారని అన్నారు. తనను చంద్రబాబు కాపాడుతారని ఆయన భావిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ అధిష్ఠానం ఎందుకు మౌనంగా ఉందో అర్థం కావడంలేదని అన్నారు.

నాదెండ్ల భాస్కరరావు అంశం గురించి రేవంత్ రెడ్డి తెలియకుండా మాట్లాడుతున్నారని జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనాడు నాదెండ్ల భాస్కరరావుకు కాంగ్రెస్ పార్టీ మద్దతుగా నిలిచిందని గుర్తు చేశారు. ఆయనకు మద్దతుగా తాను మంత్రి పదవికి రాజీనామా చేశానని వెల్లడించారు. తనను ఎవరూ తొలగించలేదని, తనంతట తానే రాజీనామా చేశానని అన్నారు. తనతో పాటు ఇందిరాగాంధీ, కాంగ్రెస్ సహా అందరూ నాదెండ్లకు మద్దతుగా నిలిచారని వెల్లడించారు. ఈ విషయం రేవంత్ రెడ్డికి తెలియదేమో అని విమర్శించారు.

# హైలెవల్ బ్రిడ్జిపై కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం

మొదటిపేజీ తరువాయి

ఒకటైన జూరాల డ్యాం భద్రతకు సంబంధించిన వంతెన నిర్మాణంపై సర్కార్ మల్లగుల్లాలు పడుతోంది. పాలమూరు జిల్లాలోని ధరూరు అమరచింత మండలాల మధ్య కృష్ణా నదిపై ఉంది ఈ ప్రాజెక్టు.

1996 లో నిర్మించిన డ్యాం పై నుంచే గద్వాల, వనపర్తి ప్రాంతాలతో పాటు కర్ణాటకకు రాకపోకలు జరుగుతున్నాయి. అయితే.... భారీ వాహనాల కారణంగా డ్యాంకు ప్రమాదం పొంచి ఉందని, వరదలప్పుడు గేట్లు తెరిచేందుకు గ్యాంటీ క్రేన్ ఆపరేటింగ్‌కు కూడా ఇబ్బందులు వస్తున్నాయని తేల్చి చెప్పారు ఇంజనీర్లు. ఈ క్రమంలో డ్యాంకు సమాంతరంగా కిలోమీటరు దిగువన హైలెవల్ బ్రిడ్జి నిర్మించి ట్రాఫిక్‌ను దాని మీది నుంచి మళ్లించాలని నిర్ణయించారు. 121కోట్ల 92 లక్షలతో రేవులపల్లి - నందిమల్ల మధ్య హైలెవల్ వంతెన నిర్మాణానికి 2025లో డిజైన్లను ఆమోదించి ప్రభుత్వానికి పంపారు. అదే ఏడాది 2025 జూన్ 1 న ప్రభుత్వం పాలనా పరమైన అనుమతులు మంజూరు చేసింది. ఇదిలా ఉంటే కొత్త వంతెనను డ్యాంకు కిలోమీటర్ దిగువన కాకుండా 11 కిలోమీటర్ల దూరంలో నిర్మించాలని మంత్రి వాకిటి శ్రీహరితో పాటు ఎమ్మెల్యేలు క్రిష్ణమోహన్ రెడ్డి , మేఘా రెడ్డి , మధుసూదన్ రెడ్డి మరి కొందరు కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు ప్రతిపాదించారు.

అందుకు అనుగుణంగానే...లొకేషన్ మార్చి గత డిసెంబర్ 1న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంఖుస్థాపన కూడా చేశారు. కానీ...పనులు మాత్రం మొదలవలేదు. హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ ప్రాంతంపై ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఎమ్మెల్యేలకు,ఎంపీకి మధ్య భిన్నాభిప్రాయాలు ఉండటం వల్లే నిలిచిపోయినట్టు తెలిసింది. ఇటీవల హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిర్వహించిన సమీక్షలో సైతం పరిస్థితి అలాగే ఉందట. దీంతో జూరాల హైలెవల్ బ్రిడ్జి అంశం పీటముడిలా మారింది. కేవలం డ్యాం సేఫ్టీ కోసమే అయితే... కిలోమీటర్ దిగువన వంతెన నిర్మిస్తే సరిపోతుందని, వాహనాలు రిస్క్ లేకుండా వంతెన మీది వెళతాయని, అదే... 11 కిలోమీటర్ల దిగువన బ్రిడ్జి కట్టి డ్యాం సేఫ్టీ కోసమని ఎలా చెబుతారంటూ ప్రశ్నిస్తున్నారు లోక్‌సభ సభ్యురాలు డీకే అరుణ. అదే సమయంలో మరో ప్రతిపాదన కూడా చేస్తున్నారామె.

బీజేపీగా తాము ఎల్లప్పుడూ అభివృద్ధిని కోరుకుంటామని, డ్యాంకు సమీపంలో ఇరిగేషన్ నిధులతో ఒక వంతెన నిర్మించి ప్రస్తుతం ఎమ్మెల్యేలు ప్రతిపాదించి, ముఖ్యమంత్రి శంఖుస్థాపన చేసిన ప్రాంతంలో ఆర్ అండ్ బీ నిధులతో హైలెవల్ బ్రిడ్జి కడితే ఎలాంటి అభ్యంతరం ఉండబోదని అన్నారామె. ఇదే అంశంపై కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. బీజేపీ ఎంపీ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ అరోపిస్తోంది. ఈ బ్రిడ్జి వల్ల ఆత్మకూరు -గద్వాల కనెక్టివిటి పెరుగుతుందని, ఈ ప్రాంత అభివృద్ధికి మరింత దోహదపడుతుందని చెప్పుకొస్తున్నారు మంత్రి వాకిటి శ్రీహరితో పాటు జిల్లా ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు. ఈ కామెంట్స్‌ను ఖండిస్తున్నారు ఎంపీ. డ్యామ్ సేఫ్టీ వంతెనతో పాటు మరోటి రెండోది కట్టమని నేను చెబుతుంటే... అభివృద్ధిని అడ్డుకోవడం ఎలా అవుతుందన్నది ఆమె ప్రశ్న. ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేక, వారి వైఫల్యాలని డైవర్షన్ చేసేందుకు ఇలాంటి ట్రిక్స్ ప్లే చేస్తున్నారని అంటున్నారు ఎంపీ. మొత్తం మీద రాజకీయాలతో ముడిపెట్టకుండా డ్యాం సేఫ్టీ బ్రిడ్జి నిర్మాణంతో పాటు ఆత్మకూరు - గద్వాల హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలని కోరుతున్నారు జిల్లా వాసులు.

# ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

మొదటిపేజీ తరువాయి

కొనసాగించాలని పేర్కొన్నారు. ఎక్కడా ఆలస్యం లేకుండా, వేగంగా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. రైతులు తమ పంటను అమ్ముకునేందుకు ఎక్కువ రోజులు వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా చూడాలని సూచించారు.

ధాన్యం సేకరణలో లాజిస్టిక్స్ కీలకమని మంత్రి వివరించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి అవసరమైనన్ని లారీలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. వాహనాల కొరత కారణంగా ధాన్యం నిల్వలు పెరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

రాత్రి, పగలు తేడా లేకుండా ధాన్యం కొనుగోళ్లు కొనసాగించాలని మంత్రి స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిల్వలు పేరుకుపోవడం వల్ల నష్టాలు కలగకుండా ఉండాలని పేర్కొన్నారు. ధాన్యం ఎక్కువగా వచ్చే గ్రామాలకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి చెప్పారు. అలాంటి ప్రాంతాలకు అదనపు లారీలు పంపించి, కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతుల నుంచి వచ్చిన ధాన్యం నిల్వలు ఎక్కువ కాలం ఉండకుండా తక్షణం తరలించాలని సూచించారు.

కొన్ని ప్రాంతాల్లో రోడ్లపై ధాన్యం పోసి ఉంచుతున్న పరిస్థితులపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను నివారించేందుకు స్కూళ్లు, ఫంక్షన్ హాళ్లు వంటి ప్రదేశాల్లో తాత్కాలిక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ధాన్యం వర్షానికి గురై నష్టపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

రేషన్ కార్డుల అంశంపై కూడా మంత్రి స్పందించారు. గత ప్రభుత్వ హయాంలో పదేళ్ల పాటు కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని ఆరోపించారు. ప్రస్తుతం ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు జారీ చేసి, సుమారు 3.78 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పేదలకు నాణ్యమైన బియ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

"ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్, తాను తినే బియ్యమే పేదలకు అందిస్తున్నాం" అని మంత్రి అన్నారు. పేదల సంక్షేమం విషయంలో ప్రభుత్వం రాజీ పడదని స్పష్టం చేశారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే తమ లక్ష్యమని చెప్పారు.

గత ప్రభుత్వంపై మంత్రి తీవ్ర ఆరోపణలు చేశారు. పదేళ్ల పాలనలో భారీగా అప్పులు చేసి వెళ్లారని విమర్శించారు. ఒకేసారి 'బంగారు తెలంగాణ' సాధ్యం కాదని, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ధాన్యం నిల్వల విషయంలో గతంలో భారీ కుంభకోణం జరిగిందని మంత్రి ఆరోపించారు. సుమారు రూ.11 వేల కోట్ల మేర అవినీతి జరిగిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొంత మేర ధాన్యం రికవరీ చేయించినట్లు తెలిపారు.

ఈ వ్యవహారంలో నల్గొండ జిల్లాలో క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు మంత్రి వెల్లడించారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని తెలిపారు. రైతుల ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ధాన్యం సేకరణలో ఎక్కడా లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులు తమ పంటకు సరైన ధర పొందేలా ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు.

మొత్తంగా రబీ ధాన్యం సేకరణపై మంత్రి చేసిన ఈ సమీక్ష సమావేశం కీలక నిర్ణయాలకు దారితీసింది. కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడం, లాజిస్టిక్స్ మెరుగుపరచడం, రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది.



# కేంద్ర నిధులపై చర్చకు సిద్ధమా?

మొదటిపేజీ తరువాయి



సిద్ధమని, వారు ఎప్పుడు సిద్ధమో చెబితే తాను వస్తానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఢిల్లీకి వచ్చింది కేవలం కాళేశ్వరం కేసులో చట్టపరమైన సలహాల కోసమేనని, ఆయన తమతో ఎలాంటి రాయబారాలు నడపడం లేదని స్పష్టం చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం మీద సీబీఐ విచారణ కోరాల్సింది పోయి, కేవలం నాణ్యత లేని బ్యారేజీల మీద మాత్రమే విచారణ కోరడం రేవంత్ రెడ్డి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఎండగట్టారు. లక్షల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసిన ప్రాజెక్టుపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి, కేసీఆర్ కేవలం బీజేపీ ఎదుగుదలను అడ్డుకోవడమే లక్ష్యంగా సమావేశాలు నిర్వహిస్తున్నారని, గత పదేళ్లుగా బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ అక్రమ మీటర్లు వేసి ప్రజాధనాన్ని దోచుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రేవంత్ 'రాహువు'.. కేసీఆర్ 'కేతువు

మొదటిపేజీ తరువాయి

రాజకీయంగా ఇద్దరూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు.

రాష్ట్ర రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్న పరిస్థితి ఏర్పడిందని బండి సంజయ్ అన్నారు. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్ మాట్లాడే తీరు ప్రజల్లో చర్చకు దారితీస్తోందని వ్యాఖ్యానించారు. మాటలకే పరిమితమై ప్రజా సమస్యలపై గంభీరత కనబరచడం లేదని విమర్శించారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్ అంశంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్ రెడ్డి తన వైఖరిని మార్చుకున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు ఒక విధంగా మాట్లాడిన ఆయన, అధికారంలోకి వచ్చిన తర్వాత మరోలా వ్యవహరిస్తున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన అవినీతి పరిమాణం ఎంతన్న దానిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. "ఈ ప్రాజెక్ట్‌లో అవినీతి రూ.లక్ష కోట్లు జరిగిందా? లేక రూ.9 వేల కోట్లు మాత్రమేనా?" అంటూ బండి సంజయ్ ప్రశ్నించారు. ప్రభుత్వం ఈ అంశంపై స్పష్టమైన సమాచారం ఇవ్వకుండా ప్రజలను గందరగోళానికి గురిచేస్తోందని విమర్శించారు. కేసీఆర్ కుటుంబంపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు భారీ అవినీతి ఆరోపణలు వచ్చాయని గుర్తుచేస్తూ, ఇప్పటి ప్రభుత్వం ఆ కుటుంబంలో ఒక్కరిపై అయినా చర్యలు తీసుకుందా అని నిలదీశారు. అవినీతి ఆరోపణలు నిజమైతే చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను ఆయన "ఏటీఎం"గా అభివర్ణించారు. గతంలో బీఆర్ఎస్‌కు ఎలా ఉపయోగపడిందో, ఇప్పుడు కాంగ్రెస్‌కు కూడా అదే విధంగా మారిందని ఆరోపించారు. అధికారాలు మారినా వ్యవహార శైలి మాత్రం మారలేదని విమర్శించారు. ఇక సీఎం రేవంత్ రెడ్డి కేంద్రానికి రాసిన లేఖలపై కూడా బండి సంజయ్ ప్రశ్నలు లేవనెత్తారు. రూ.9 వేల కోట్ల అవినీతిపై మాత్రమే దర్యాప్తు కోరుతూ లేఖ రాయడం ఎందుకని అడిగారు. అదే సమయంలో లక్ష కోట్ల అవినీతి ఆరోపణలపై ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు.

ఈ లేఖల అసలు ఉద్దేశ్యం ఏమిటో ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తాము ఆ లేఖలను కరపత్రాల రూపంలో ముద్రించి ఇంటింటికీ పంచుతామని చెప్పారు. ప్రజలకు నిజాలు తెలియజేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఢిల్లీ పర్యటనపై కూడా ఆయన స్పందించారు. ఈ పర్యటనపై వేర్వేరు వర్గాలు వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయని పేర్కొన్నారు. అసలు ఈ పర్యటన వెనుక ఉద్దేశ్యం ఏమిటో స్పష్టత రావాలని అన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. మహిళలు ఉన్నతస్థాయికి ఎదగాలని ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. మహిళలకు రాజకీయాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించేందుకు బీజేపీ కట్టుబడి ఉందని అన్నారు.అయితే ఈ బిల్లును కాంగ్రెస్ అడ్డుకోవడం తగదని, అది పూర్తిగా మూర్ఖత్వమని వ్యాఖ్యానించారు.

# విభజనపై విషం చిమ్మొద్దు

మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు బహిరంగ లేఖ రాసి తన ఆందోళనలను వెల్లడించారు. ఇటీవల కొన్ని రాజకీయ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు రెండు రాష్ట్రాల మధ్య అపోహలు, విద్వేషాలు పెంచేలా ఉన్నాయని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు.

పొన్నం ప్రభాకర్ తన లేఖలో ముఖ్యంగా భాజపా, తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీల నేతల వ్యాఖ్యలను ప్రస్తావించారు. రాష్ట్ర విభజన అనుచితంగా జరిగిందని, అది ప్రజలపై అన్యాయం చేసిందని చెప్పే విధంగా వ్యాఖ్యలు చేయడం తగదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విధమైన వ్యాఖ్యలు చరిత్రను వక్రీకరించడమే కాకుండా, రెండు రాష్ట్రాల ప్రజల మధ్య అనవసర విభేదాలకు దారి తీస్తాయని హెచ్చరించారు. రాష్ట్ర విభజన ఒక రాజ్యాంగబద్ధ ప్రక్రియగా జరిగిందని, దాన్ని తిరస్కరించేలా లేదా అపహాస్యం చేసేలా మాట్లాడటం సరైంది కాదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో నిర్ణయాలు తీసుకున్న తర్వాత వాటిని గౌరవించడం అవసరమని పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం గత విషయాలను మళ్లీ తెరపైకి తీసుకురావడం సమాజానికి మేలు చేయదని ఆయన అన్నారు.

ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పొన్నం ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. ఈ సమయంలో విభజన అంశాన్ని వివాదాస్పదంగా మలచడం అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుందని పేర్కొన్నారు. రెండు రాష్ట్రాలు పరస్పర సహకారంతో ముందుకు వెళ్తేనే ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన సూచించారు.

తన లేఖలో ఎంపీ తేజస్వి చేసిన వ్యాఖ్యలపై కూడా మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆ వ్యాఖ్యలు లోక్‌సభలో నమోదు కావడం దురదృష్టకరమని పేర్కొంటూ, వాటిని అధికారిక రికార్డుల నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాయాలని కూడా చంద్రబాబును ఆయన విజ్ఞప్తి చేశారు.పార్లమెంటు వంటి గౌరవనీయ వేదికలలో బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన అవసరం ఉందని పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. ప్రజల ముందు ఉన్న నేతలు చేసే ప్రతి వ్యాఖ్య సమాజంపై ప్రభావం చూపుతుందని, అందువల్ల మాటల ఎంపికలో జాగ్రత్త అవసరమని అన్నారు.ఇక రాజకీయ నాయకుల బాధ్యతపై కూడా మంత్రి తన లేఖలో దృష్టి సారించారు. ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడం నాయకుల కర్తవ్యమని, విభేదాలను రెచ్చగొట్టడం కాదు అని స్పష్టం చేశారు. ముఖ్యంగా రెండు రాష్ట్రాల మధ్య సున్నితమైన అంశాలపై వ్యాఖ్యలు చేసే సమయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

రాష్ట్ర విభజన తరువాత ఏర్పడిన సమస్యలను పరిష్కరించేందుకు రెండు రాష్ట్రాలు కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. నీటి పంపిణీ, ఆస్తుల విభజన, ఉద్యోగుల సమస్యలు వంటి అంశాలపై పరస్పర చర్చల ద్వారా పరిష్కారం కనుగొనాలని సూచించారు. ఈ నేపథ్యంలో రాజకీయ ఉద్రిక్తతలు పెంచే వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. తన లేఖ చివర్లో, ఈ అంశాన్ని గంభీరంగా పరిగణించి



తగిన చర్యలు తీసుకుంటారని చంద్రబాబుపై ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రాల మధ్య సఖ్యతను కాపాడేందుకు మీ నాయకత్వం కీలకమని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా రాష్ట్ర విభజన అంశంపై మళ్లీ చర్చలు రగులుతున్న నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ రాసిన ఈ బహిరంగ లేఖ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. రెండు రాష్ట్రాల మధ్య సౌహార్ద వాతావరణం కొనసాగాలంటే నేతలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ఈ లేఖ మరోసారి గుర్తు చేస్తోంది.

# బీజేపీతోనే అభివృద్ధి.. భద్రత

- బెంగాల్ ఎన్నికల వేళ అమిత్ షా ప్రకటనలు
- టీఎంసీపై తీవ్ర విమర్శలు, భారీ హామీలు
- తొలి విడత పోలింగ్‌కు ముందే వేడెక్కిన ప్రచారం
- టీఎంసీ ప్రభుత్వంపై అమిత్ షా తీవ్ర విమర్శలు
- రామమందిరం–బాబ్రీ మసీదు వ్యాఖ్యలతో కొత్త వివాదం
- యువతకు ప్రతి ఏడాది లక్ష ఉద్యోగాల హామీ
- యూనిఫాం సివిల్ కోడ్‌పై కీలక ప్రకటన
- మమతా కుటుంబ రాజకీయాలపై ఆరోపణలు
- మహిళల భద్రత అంశంపై దుమారం
- గూర్ఖా సమస్య పరిష్కారంపై హామీ

**నేషనల్‌బ్యూరో, (డిడి9 వార్త):**

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తొలి విడత సమీపిస్తున్న వేళ రాజకీయ ప్రచారం ఉత్కంఠభరితంగా మారింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధికార తృణమూల్ కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలకు పిలుపునిస్తూ, పలు కీలక హామీలు ఇచ్చారు. రాష్ట్ర రాజకీయాల్లో మత, అభివృద్ధి, భద్రత అంశాలను ముందుకు తెస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.సల్‌బోని, కుల్టీ ప్రాంతాల్లో నిర్వహించిన భారీ ఎన్నికల సభల్లో అమిత్ షా మాట్లాడారు. ఒకప్పుడు పారిశ్రామిక కేంద్రంగా పేరుగాంచిన కుల్టీ ప్రాంతం ప్రస్తుతం క్షీణించిందని అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల వల్ల పరిశ్రమలు దెబ్బతిన్నాయని విమర్శించారు. అక్రమ మైనింగ్ పెరిగిపోయిందని, పర్యావరణ కాలుష్యం అధికమైందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వస్తే పరిశ్రమలను పునరుద్ధరిస్తామని, కాలుష్య నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన చేసిన రామమందిరం, బాబ్రీ మసీదు వ్యాఖ్యలు రాజకీయంగా పెద్ద చర్చకు దారితీశాయి. బీజేపీ ప్రభుత్వం రామమందిరం నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తే, టీఎంసీ అనుబంధ వర్గాలు బాబ్రీ మసీదు నిర్మాణానికి మద్దతు ఇస్తున్నాయని ఆరోపించారు. బంగాల్ భారత్‌లో భాగమని, దేశ విభజనకు దారితీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోమని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలతో ఎన్నికల ప్రచారం మరింత వేడెక్కింది.

యువతకు ఉపాధి కల్పనపై కూడా అమిత్ షా కీలక హామీ ఇచ్చారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే ప్రతి సంవత్సరం లక్ష మందికి మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఉద్యోగాల్లో అవినీతి పెరిగిపోయిందని, అర్హుల అవకాశాలను అనర్హులకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. పారదర్శక నియామక వ్యవస్థను తీసుకువస్తామని చెప్పారు.మరో కీలక అంశంగా యూనిఫాం సివిల్ కోడ్‌ను ప్రస్తావించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో యూనిఫాం సివిల్ కోడ్ అమలు చేస్తామని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించడం లక్ష్యమని పేర్కొన్నారు. బహుళ వివాహాలపై నిషేధం విధిస్తామని స్పష్టం చేశారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కొన్ని వర్గాలను ప్రోత్సహిస్తున్నారని టీఎంసీపై విమర్శలు గుప్పించారు.

ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై కూడా అమిత్ షా వ్యక్తిగత స్థాయిలో విమర్శలు చేశారు. ఆమె రాజకీయ లక్ష్యం తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీను భవిష్యత్తులో ముఖ్యమంత్రిని చేయడమేనని ఆరోపించారు. కుటుంబ రాజకీయాలను ప్రజలు తిరస్కరిస్తారని అన్నారు. అయితే ప్రస్తుతం అమలులో ఉన్న సంక్షేమ పథకాలను బీజేపీ రద్దు చేయదని, వాటిని మరింత విస్తరిస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్రంలో మహిళల భద్రత అంశాన్ని కూడా ప్రధానంగా ప్రస్తావించారు. పలు ప్రాంతాల్లో జరిగిన ఘటనలను ఉదాహరణగా చూపిస్తూ, మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాత్రివేళల్లో మహిళలు బయటకు రావడానికి



భయపడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలకు 24 గంటల భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు.

డార్జిలింగ్‌లో జరిగిన మరో సభలో గూర్ఖా సమస్యపై కీలక ప్రకటన చేశారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను ఆరు నెలల్లో పరిష్కరిస్తామని చెప్పారు. గూర్ఖాలాండ్ ఉద్యమంలో పాల్గొన్న వారిపై ఉన్న కేసులను ఉపసంహరించుకుంటామని తెలిపారు. గూర్ఖా సమాజానికి న్యాయం చేయగలిగేది బీజేపీ మాత్రమేనని అన్నారు.బంగాల్ ఎన్నికల ప్రచారం రోజు రోజుకీ మరింత ఉత్కంఠభరితంగా మారుతోంది. బీజేపీ, తృణమూల్ కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం తీవ్రతరమవుతోంది. అభివృద్ధి, మతం, భద్రత, ఉపాధి వంటి అంశాల చుట్టూ ఎన్నికల సమరం తిరుగుతోంది. తొలి విడత పోలింగ్ దగ్గరపడుతున్న కొద్దీ రాజకీయ వేడి మరింత పెరుగుతోంది. ఎన్నికల ఫలితాలు రాష్ట్ర భవిష్యత్తు దిశను నిర్ణయించనున్నాయి.

## కన్గుట్ట లో ఘనంగా బ్రహ్మంగారి కళ్యాణం

**ఆదిలాబాద్, బోథ్ ఏప్రిల్ 20(డిడి9 వార్త):-**

కన్గుట్ట గ్రామంలో మంగళవారం బ్రహ్మంగారి కళ్యాణం కన్నుల పండుగగా జరిగింది. వేద పండితులు చెబ నమలి కొండ సంతోష్ కుమార్ శర్మ, సుజయ్ కుమార్ శర్మ ల ఆధ్వర్యంలో పుణ్యాహవాచనం, గణపతి, గౌరీ పూజా స్వామి వారి కి పంచామృత అభిశేక కార్యక్రమం . అనంతరం కళ్యాణం , ఆహ్వానిత దేవతల హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు



## DME కార్యాలయం ముందు చేపట్టబోయే మహా ధర్నా కార్యక్రమం కు బయలు దేరిన రిమ్స్ మరియు సూపర్ స్పెషలిటీ కార్మికులు

**ఆదిలాబాద్, బోథ్ ఏప్రిల్ 20(డిడి9 వార్త):-**

ఈ రోజు AITUC తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో DME కార్యాలయం ముందు మహా ధర్నా చేపట్టడం జరిగింది. ఈ మహాధర్నా కు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిర్ర దేవేందర్ తో పాటు ఆదిలాబాద్ జిల్లా రిమ్స్ మరియు సూపర్ స్పెషలిటీ ఆసుపత్రుల కార్మికులు దాదాపుగా 30 మంది బయలు దేరడం జరిగింది. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిర్ర దేవేందర్ మాట్లాడుతూ హైదరాబాద్ కోఠి లోని DME కార్యాలయం ముందు చేపట్టబోయే ఈ మహాధర్నా ముఖ్య ఉద్దేశం ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి లేదంటే ప్రత్యేక కార్పొరేషన్ వెంటనే ఏర్పాటు చేసి కార్మికులకు నేరుగా వేతనాలు ఇచ్చి PF ESI సమస్య ఉండకుండా చూడాలి అలాగే కార్మికులకు పండుగ అర్జిత సెలవులు పకడ్బందిగా అమలు చేయాలి కార్మికులకు యూనిఫామ్స్ పరికరాలు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలనే డిమాండ్ లను DME గారు వెంటనే పరిష్కరించాకపోతే యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు తప్పవని రాష్ట్ర ప్రభుత్వం ను హేచ్చరించారు.ఈ కార్యక్రమం కు బయలు దేరిన యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు P. రమేష్, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డోంగ్రే చందు, అధ్యక్షులు నల్ల శివన్న, వర్కింగ్ ప్రెసిడెంట్స్ MD ముజీబ్, MD ఇర్ఫాన్ఖాన్, సహాయ కార్యదర్శి కన్నల లక్ష్మి, రిమ్స్ బ్రాంచ్ అధ్యక్షులు G. సంగీత, సూపర్ స్పెషలిటీ ఆసుపత్రి బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి పెందుర్ దిలీప్, జిల్లా నాయకులు Y ప్రవీణ్, ధాత్రాత్రి దాస్, పద్మ, ఉప్పరి నర్సమ్మ, కమలమ్మ, తదితర కార్మికులు ఉన్నారు.






## బోధన్ లోని పాండు చెరువు పునరుద్ధరణ పనుల పరిశీలన

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 21(డీడీ9 వార్త):**



బోధన్ పట్టణంలోని పాండు చెరువు సుందరీకరణ, పునరుద్ధరణ పనులను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్మంమహాతో మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అమృత్ 2.0 పథకం కింద చేపట్టిన ఈ పనుల పురోగతిని మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ డీఈ మరియు నీటి పారుదల శాఖ ఇంజినీర్లతో కలిసి ఆయన పర్యవేక్షించారు. చెరువులోకి మురుగునీరు చేరకుండా అడ్డుకట్ట వేసేందుకు, ఆ నీటిని ప్రత్యామ్నాయంగా ప్రస్తుతం ఉన్న డ్రైనేజీ కాలువల్లోకి మళ్లించేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆదేశించారు. అనంతరం సబ్ కలెక్టర్ వికాస్ మహాతో అచన్‌పల్లిలోని డంపింగ్ యార్డ్‌ను సందర్శించారు. అక్కడ నూతనంగా నిర్మిస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్ పనులను పరిశీలించిన ఆయన, యార్డులో చెత్త సేకరణ మరియు విభజన ప్రక్రియ జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణ పరిశుభ్రతలో భాగంగా వ్యర్థాల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్ వాడి టీచర్లకు ఫోన్లు అందజేసిన గౌరవ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ .

**ఆదిలాబాద్, బోథ్ ఏప్రిల్ 20(డిడి9 వార్త):-**

రాష్ట్ర ప్రభుత్వం ఐసీడీఎస్ ప్రాజెక్టు కింద అంగన్ వాడి టీచర్లకు అందజేస్తున్న 5G ఫోన్లను ఈరోజు నెరడిగొండ మండల కేంద్రంలో నియోజకవర్గంలోని బోథ్, సోనాల, ఇచ్చోడ, నెరడిగొండ, బజార్ హత్నూర్, సిరికొండ మండలాలకు చెందిన 289 మంది అంగన్ వాడి టీచర్లకు, సూపర్ వైజర్లకు, బ్లాక్ కోఆర్డినేటర్లకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ... సెల్ ఫోన్లు ఇవ్వడం బానే ఉంది కాని, ప్రభుత్వం అంగన్ వాడిలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవీ ఇంచార్జి వినూత్న, బ్లాక్ కోఆర్డినేటర్ శివాజీ, మండల సూపర్ వైజర్లు లలిత, మంజుల, విమల, మౌనిక, జంగుబాయి, సుమలత మరియు అంగన్ వాడి టీచర్లు పాల్గొన్నారు.




## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య సాలురలో ఉత్సాహంగా 'బడిబాట'

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 21(డీడీ9 వార్త):**

ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న అత్యాధునిక వసతులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సాలురా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజీ మంజూష కోరారు. వార్షిక పరీక్షలు ముగిసిన నేపథ్యంలో, మంగళవారం సాలురా గ్రామంలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి 'బడిబాట' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం గ్రామంలోని వీధివీధినా తిరుగుతూ ఇంటింటా ప్రచారం నిర్వహించింది. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న డిజిటల్ బోధన, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, గ్రంథాలయ సౌకర్యాలతో పాటు 'పీఎం శ్రీ' పాఠశాలగా ఎంపికైన సాలురా పాఠశాల ప్రాధాన్యతను గ్రామస్తులకు వివరించారు. గత నాలుగు రోజులుగా పాఠశాల పరిధిలోని తగ్గేల్లి, ఖాజాపూర్, సాలుర క్యాంప్ గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ అవగాహన కల్పిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల పట్ల గ్రామస్తులు ఎంతో ఆసక్తిని కనబరుస్తున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. ప్రైవేటుకు దీటుగా సర్కారు బడుల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడ్డాయని, అర్హత గల ఉపాధ్యాయులతో బోధన సాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శోభారాణి, విజయ్ కుమార్, సుధారాణి, విజయలక్ష్మి, లక్ష్మి, గంధం సాయిలు, జ్యోత్స్న, అబ్బయ్య, అరుణ్ కుమార్, కాంబ్లే విఠల్, అక్షయ్ కుమార్, మేడి రవి, వనజ, స్వర్ణ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.






## ధన్నూర్ బి ప్రాథమిక పాఠశాల లో ఘనంగా పట్టభద్రోత్సవ దినోత్సవం

**ఆదిలాబాద్, బోథ్ ఏప్రిల్ 20(డిడి9 వార్త):-**

మండలంలోని ధన్నూర్ బి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం Graduation day ఘనంగా నిర్వహించారు.ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ధన్నూర్ బి సర్పంచ్,రోహిణి వినయ్ రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజు చోప్డెలు హాజరయ్యారు.మొదటగా జ్యోతి ప్రజ్వలన గావించి అధ్భుతమైన నృత్య ప్రదర్శనతో అలరించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావుల శంకర్ మాట్లాడుతూ ఐదవ తరగతి పూర్తి అయిన విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చామన్నారు.విద్యార్థులు చక్కగా చదువుకొని చదువులో రాణించాలన్నారు. సమాజంలో మంచి గుర్తింపు పొందాలన్నా, అమ్మానాన్నల కళలు నెరవేరాలన్నా,చదువొక్కటే మార్గమన్నారు.ఉన్నతమైన చదువులు చదివి భవిష్యత్తులో పేరు ప్రఖ్యాతులు సంపాదించాలన్నారు.ఈ కార్యక్రమంలో సి.ఆర్.పి.రమేష్ , ఉపాధ్యాయులు ఆర్. సవిత,వై.స్వప్న ,మాడ ప్రశాంత్ కుమార్,బి.సారిక,వాజిద్ తదితరులు పాల్గొన్నారు

## అకాల వర్షం కారణంగా తడిసిన ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలి

- తడిసిన జొన్నలను పరిశీలించిన గౌరవ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ .

**ఆదిలాబాద్, బోథ్ ఏప్రిల్ 20(డిడి9 వార్త):-**

బోథ్ మండలంలోని ధన్నూర్ గ్రామంలో కురిసిన అకాల వర్షం కారణంగా తడిసిన జొన్న కుప్పలను మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతులతో మాట్లాడి వారికి ధైర్యం కల్పించారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతోనే రైతులు నష్టపోతున్నారని అన్నారు. అకాల వర్షం కారణంగా తడిసిన ప్రతీ గింజను ప్రభుత్వం బేషరతుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వీరి వెంట మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



## ఒక ఎకరానికి 20 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేయండి

- జొన్నల కొనుగోలు సెంటర్లు పెంచండి
- జిల్లా ఇన్చార్జ్ మంత్రికి విన్నవించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి

**ఆదిలాబాద్, బోథ్ ఏప్రిల్ 20(డిడి9 వార్త):-**



అదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా తెల్ల జొన్నలు విస్తారంగా సాగు చేసిన నేపథ్యంలో అంచనాలకు మించి దిగుబడి. వచ్చిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ఒక ఎకరానికి 20 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలని, రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రాలను పెంచాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి .ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు గారిని కోరడం జరిగింది. వెంటనే స్పందించిన .జిల్లా ఇన్చార్జ్ మంత్రి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కి కొనుగోలు, సెంటర్ల పెంపుకై ఆదేశాలు జారీ చేస్తూ, ఒక ఎకరానికి 20 క్వింటాళ్లు తీసుకునే విషయం రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి, ఆర్థిక మంత్రి మరియుముఖ్యమంత్రి గారితో మాట్లాడి పోయిన సంవత్సరాని కంటే ఎక్కువ కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.



## ప్రజా పాలన ప్రగతి బాటలో భాగంగా నిర్వహించిన రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్

**ఆదిలాబాద్, బోథ్ ఏప్రిల్ 20(డిడి9 వార్త):**

ప్రజా పాలన ప్రగతి బాటలో భాగంగా నిర్వహించిన రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్. ఎమ్మార్వో కలీం తో కలిసి కిస్టాపూర్ గ్రామానికి విచ్చేసి, గ్రామ ప్రవేశం వద్ద ఉన్న సర్వీస్ రోడ్ మరియు స్కూల్ బస్ స్టాప్ సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా త్వరలోనే సరైన సర్వీస్ రోడ్ , ఆర్టీసీ బస్ స్టాప్ ఏర్పాటు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మా గ్రామ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విని, వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని తెలిపిన జిల్లా కలెక్టర్ కి కిస్టాపూర్ గ్రామ ప్రజల తరపున గ్రామ సర్పంచ్ సోలంకి జితేందర్ సింగ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఇందులో జి పి ఓ షకీల్ గ్రామస్తులు తదితరులు ఉన్నారు





# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

- **నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య**
- **బోధన్‌లో మన ఊరు - మన భద్రత సదస్సు**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 21(డీడీ9 వార్త):**

రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాల కట్టడి, డ్రగ్స్ రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భాగస్వాములు కావాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య పిలుపునిచ్చారు. మంగళవారం బోధన్‌లోని లయన్స్ క్లబ్ భవనంలో మన ఊరు మన భద్రత మన బాధ్యత పేరిట కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు అరైవ్ అలైవ్2026 కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ సమావేశానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో నేరాల వల్ల సంభవించే మరణాల కంటే రోడ్డు ప్రమాదాల వల్ల జరుగుతున్న మరణాలే ఆందోళనకరంగా ఉన్నాయని ఆయన గణాంకాలతో వివరించారు. గత 2025 సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా వివిధ ఘటనల్లో 47 మంది హత్యకు గురవ్వగా, రోడ్డు ప్రమాదాల్లో ఏకంగా 302 మంది ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు. కరోనా సమయంలో రెండేళ్లలో 200 మంది మృతి చెందితే, ఒక్క ఏడాదిలోనే రోడ్డు ప్రమాదాలు అంతకంటే ఎక్కువ మందిని బలి తీసుకోవడం రోడ్డు భద్రత ఆవశ్యకతను తెలియజేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలో రోడ్డు ప్రమాదాలు లేని దేశంగా ఫిన్లాండ్ గుర్తింపు పొందిందని, అదే స్ఫూర్తితో మన దగ్గర కూడా వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని కోరారు. రైతులు పండించిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబోసినప్పుడు ప్రమాదాలు జరగకుండా భద్రతా కోన్లు లేదా రేడియం స్టిక్కర్లు ఉన్న బకెట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్ ఫోన్ వాడటం మృత్యువును ఆహ్వానించడమేనని, అతివేగం మరియు అజాగ్రత్త ప్రాణాలకే ముప్పు తెస్తాయని హెచ్చరించారు. గ్రామాల్లో భద్రతను పటిష్టం చేసేందుకు సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని, యువత డ్రగ్స్ మరియు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిస కాకుండా నిరంతరం గమనిస్తూ ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటేశ్వరరావు, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, మున్సిపల్ చైర్మన్ తూము పద్మ శరత్ రెడ్డి, వైస్ చైర్మన్ ఇలియాస్, సీఐలు, ఎస్సైలు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పాఠశాలకు అల్మారాల వితరణ

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 21(డీడీ9 వార్త):**

కమ్మర్ పల్లి మండలం చౌట్‌పల్లి పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి దాతలు అండగా నిలిచారు. గ్రామానికి చెందిన కీ.శే. రాజుల దేవాయి బుచ్చయ్య దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు రాజుల సాయన్న, హరిదాస్, అర్జున్ మరియు మనవలు సుమారు రూ. 30 వేల విలువైన ఐదు బీరువాలను మంగళవారం పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దాతలు అల్మారాలను ప్రధానోపాధ్యాయులు ఎన్.ఆంధ్రయ్యకు అప్పగించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. పాఠశాల అవసరాలను గుర్తించి విరాళం అందించిన రాజుల కుటుంబ సభ్యుల సేవా దృక్పథాన్ని కొనియాడారు. విద్యార్థుల ప్రయోజనార్థం దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మహబూబ్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.








## పోలీసు సిబ్బందికి యూనిఫాం సామగ్రి పంపిణీ

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 21(డీడీ9 వార్త):**

జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ మరియు ట్రాఫిక్ సిబ్బందికి ప్రభుత్వం నుంచి అందిన యూనిఫాం సామగ్రిని, కూలింగ్ గ్లాసులను మంగళవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ పి.సాయి చైతన్య పంపిణీ చేశారు. రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి అందిన ఈ కిట్లను సిబ్బందికి అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండ తీవ్రత అధికంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ట్రాఫిక్ విధుల్లో ఉండే సిబ్బందికి కూలింగ్ గ్లాసులు ఎంతో మేలు చేస్తాయని, వారి ఆరోగ్యం మరియు భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వీటిని అందించిందని తెలిపారు. పోలీస్ సిబ్బంది తమ విధులను మరింత ఉత్సాహంగా, అంకితభావంతో నిర్వహించేందుకు ఈ ఆధునిక సామగ్రి తోడ్పడుతుందని అధికారులు పేర్కొన్నారు. క్రమశిక్షణతో కూడిన యూనిఫాం ధరించడం పోలీసుల బాధ్యత అని, వృత్తిపరమైన సౌకర్యాల కల్పనలో పోలీస్ శాఖ ఎప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (ఏఆర్) రామచంద్రరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ధరణి కుమార్, సతీష్, ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ఆర్ఐ వినోద్‌తో పాటు పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## కొనసముందర్ అంగన్‌వాడీలో పట్టభద్రోత్సవం

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 21(డీడీ9 వార్త):**

చిన్నారుల కిలకిలరావాలు.. తల్లిదండ్రుల మురిపాలు.. ఉపాధ్యాయుల ప్రోత్సాహం మధ్య కొనసముందర్ అంగన్‌వాడీ కేంద్రం సందడిగా మారింది. కమ్మర్ పల్లి మండలంలోని కొనసముందర్ లక్ష్మి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్షం వేడుకలను పురస్కరించుకుని చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా హాజరైన గ్రామ సర్పంచ్ బెజ్జారపు రాకేష్, ఉప సర్పంచ్ బలేరావ్ శంకర్ చిన్నారులకు అభివృద్ధి సూచిక (ప్రోగ్రెస్ కార్డు) పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తోందని, ప్రైవేటుకు దీటుగా విద్య, పౌష్టికాహారం అందుతోందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా కేంద్రాలకు పంపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పుష్ప, శారద, మధులత మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.






## ఉత్సాహంగా సెక్యూరిటీ కౌన్సిల్ క్రికెట్ టోర్నీ

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 21(డీడీ9 వార్త):**

నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ రెండో రోజు ఉత్సాహభరితంగా సాగింది. నగరంలోని మహిళా కళాశాల మైదానంలో జరుగుతున్న ఈ క్రీడలను మంగళవారం పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య సందర్శించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారిని ఉత్సాహపరిచిన సీపీ.. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. రెండో రోజు ఆటలో భాగంగా మొత్తం నాలుగు మ్యాచ్‌లు నిర్వహించగా, క్రీడాకారులు తమ ప్రతిభతో ప్రేక్షకులను అలరించారు. తొలి మ్యాచ్‌లో గజానన్ జట్టు 96 పరుగులు చేయగా, గుండారం ఎలెవన్ జట్టు 94 పరుగులకే పరిమితమై ఓటమి పాలైంది. రెండో పోరులో వేల్పూరు పోలీస్ స్టేషన్ జట్టు 95 పరుగులు సాధించి, 94 పరుగులు చేసిన ముప్కాల్ ఎలెవన్ జట్టుపై విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో అమ్దాపూర్ జట్టు నిర్దేశించిన 74 పరుగుల లక్ష్యాన్ని ఛత్రపతి శివాజీ జట్టు కేవలం రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. నాలుగో మ్యాచ్‌లో వర్ని వారియర్స్ జట్టు గైర్హాజరు కావడంతో (వాక్ ఓవర్), మోహన్ ఎలెవన్ జట్టు విజేతగా నిలిచింది. టోర్నీ రసవత్తరంగా సాగుతుండటంతో తదుపరి మ్యాచ్‌లపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు, సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులు మరియు క్రీడాభిమానులు పాల్గొన్నారు.




## అదనపు డీసీపీ బస్వా రెడ్డికి ఘన వీడ్కోలు

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 21(డీడీ9 వార్త):**

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో అదనపు డీసీపీ (అడ్మిన్)గా విధులు నిర్వర్తించి, బదిలీపై వెళ్తున్న బస్వా రెడ్డిని నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా అభినందించారు. కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన ఈ వీడ్కోలు సమావేశానికి పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ముఖ్య అతిథిగా హాజరై బస్వా రెడ్డిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. జిల్లాలో బస్వా రెడ్డి అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. ముఖ్యంగా పోలీసు పరిపాలన విభాగంలో ఆయన చూపిన చొరవ, కట్టుదిట్టమైన క్రమశిక్షణ, ప్రజల భద్రత కోసం తీసుకున్న నిర్ణయాలు పోలీస్ శాఖకు ఎంతో బలాన్ని ఇచ్చాయని ప్రశంసించారు. విధి నిర్వహణలో ఆయన చూపిన అంకితభావం తోటి అధికారులకు ఆదర్శనీయమని, భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సీపీ ఆకాంక్షించారు. సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులు కూడా బస్వా రెడ్డి సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు, సెక్యూరిటీ కౌన్సిల్ ప్రతినిధులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొని ఆయనకు వీడ్కోలు పలికారు.






## ముగిసిన జనగణన శిక్షణ తరగతులు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 21(డీడీ9 వార్త):**

బోధన్ పట్టణ మున్సిపల్ కార్యాలయంలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు జనగణన2027పై నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ నెల 18న ప్రారంభమైన ఈ శిబిరంలో మున్సిపల్ పరిధిలో చేపట్టాల్సిన గృహ గణన మరియు జనగణన అంశాలపై సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఫీల్డ్ ట్రైనర్లు ఆర్.శివకుమార్, బి.శివకుమార్ లు క్షేత్రస్థాయిలో గణన చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నమోదు ప్రక్రియపై ఎన్యుమరేటర్లకు వివరించారు. ముగింపు కార్యక్రమానికి చార్జ్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ హాజరై మాట్లాడారు. జనగణన ప్రక్రియలో ఎలాంటి తప్పులు దొర్లకుండా పకడ్బందీగా సమాచారాన్ని సేకరించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా సెన్సెస్ యాప్ వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రమేష్, టీపీఓ మరియు అడిషనల్ చార్జ్ ఆఫీసర్ బి.వెంకటేష్, టీపీబీఓలు సజన్, సచిన్ మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# టీ20 ప్రపంచకప్‌లో ఫిక్సింగ్ కలకలం..
# కెనడా క్రికెట్‌లో బిష్ణోయ్ గ్యాంగ్!

- టీ20 ప్రపంచకప్‌లో కెనడా జట్టు మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు
- కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వాపై ఐసీసీ అవినీతి నిరోధక విభాగం విచారణ
- బజ్వాను కెప్టెన్‌గా నియమించడం వెనుక లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ హస్తం
- ఆటగాళ్లను బెదిరించి కెప్టెన్సీ ఇప్పించినట్లు సంచలన కథనం
- ఈ కుంభకోణంలో కెనడా క్రికెట్ ప్రెసిడెంట్ పాత్రపైనా అనుమానాలు

**డిడి9 వార్త:**

ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో పెను సంచలనం రేగింది. కెనడా క్రికెట్ జట్టులో మ్యాచ్ ఫిక్సింగ్ కుంభకోణం బయటపడటంతో ఐసీసీ దర్యాప్తు ప్రారంభించింది. ఈ స్కాండల్ వెనుక సింగర్ సిద్ధూ మూసేవాలా హత్య కేసులో నిందితుడిగా ఉన్న లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ హస్తం ఉన్నట్లు వెలుగులోకి రావడం క్రీడా ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. కెనడా కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వా ప్రమేయంపై ఐసీసీ అవినీతి నిరోధక విభాగం (ఏసీయూ) విచారణ జరుపుతోంది. కెనడియన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (సీబీసీ) ప్రచురించిన ఒక కథనం ప్రకారం ఈ ఫిక్సింగ్ వ్యవహారంలో బిష్ణోయ్ గ్యాంగ్ ప్రమేయం స్పష్టంగా కనిపిస్తోంది. న్యూజిలాండ్‌తో జరిగిన గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లో దిల్‌ప్రీత్ బజ్వా అసాధారణంగా, ఖరీదైన ఓవర్ వేయడంతో అతనిపై అనుమానాలు మొదలయ్యాయి. దీంతో ఏసీయూ అధికారులు బజ్వాను ప్రశ్నించి, అతని మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

టీ20 ప్రపంచకప్‌కు కొన్ని వారాల ముందు బజ్వాను కెప్టెన్‌గా నియమించడం వెనుక పెద్ద కుట్రే జరిగిందని సీబీసీ కథనం పేర్కొంది. 2025 జులైలో కొందరు ఆటగాళ్లను బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యులు బెదిరించి, బజ్వాకు మద్దతివ్వాలని ఒత్తిడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. "బజ్వా ప్రమోషన్‌కు మద్దతివ్వకపోతే, నీకు, నీ కుటుంబానికి తీవ్ర పరిణామాలు తప్పవు" అని ఓ సీనియర్ ఆటగాడిని బెదిరించినట్లు తెలిసింది. ఈ ప్రతిపాదనను వ్యతిరేకించిన 'నోవా' అనే మరో ఆటగాడికి భయానక ఫొటోతో కూడిన మెసేజ్ పంపి హెచ్చరించినట్లు సమాచారం.

డబ్బు సంపాదించడానికే మ్యాచ్‌లను ఫిక్స్ చేసేందుకు బజ్వాను కెప్టెన్‌గా నియమించారని 'నోవా' ఆరోపించారు. ఈ వ్యవహారంలో కెనడా క్రికెట్ ప్రస్తుత అధ్యక్షుడు అర్విందర్ ఖోసా పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బజ్వాను కెప్టెన్‌గా ప్రతిపాదించిన వారిలో ఖోసా కూడా ఉన్నారని, అయితే ఆయన ఈ ఆరోపణలను ఖండిస్తూ తనపై రాజకీయ కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. కెనడా ప్రభుత్వం ఇప్పటికే లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించిన నేపథ్యంలో ఈ ముఠా ఏకంగా ఒక జాతీయ జట్టులోకి చొరబడటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.



## బీఆర్ఎస్ గూటికి చేరిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొమ్మడి సంజీవ్



- సొంత గూటికి చేరిన గెడం తులసిరాం
- బజార్ హత్నూర్ మండలంలో మారుతున్న రాజకీయ సమీకరణాలు

**ఆదిలాబాద్, బోథ్ ఏప్రిల్ 20(డిడి9 వార్త):-**

బజార్ హత్నూర్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఆదర్శ రైతు, మాజీ మున్నూరుకాపు అధ్యక్షులు బొమ్మడి సంజీవ్. ఈరోజు అధికార కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అదేవిధంగా గెడం తులసిరాం తిరిగి సొంత గూటికి చేరారు. వీరికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్. మంగళవారం గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ... బొమ్మడి సంజీవ్ . తన గెలుపు కోసం గతంలో కష్టపడ్డారని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. మళ్ళీ కలిసి పని చేసే రోజులు వచ్చాయని, బజార్ హత్నూర్ మండలంలో కాంగ్రెస్ ఖాళీ దిశగా బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కష్టపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్, సర్పంచ్ సాయన్న, ఉప సర్పంచ్ కొంగర్ల రాజన్న, బీఆర్ఎస్ నాయకులు చట్ల వినిల్, తరుణ్, ఇచ్చొడ మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నానక్ సింగ్, సర్పంచ్ రమేష్ తదితరులు ఉన్నారు.



## కోహ్లీ వల్లే క్రికెట్ చూడటం మొదలుపెట్టా..
## మేమిద్దరం టచ్‌లోనే ఉంటాం.. త్వరలో భారత్‌కు వస్తా

- విరాట్ కోహ్లీ వల్లే తాను క్రికెట్‌ను ఇష్టపడటం ప్రారంభించానన్న జొకోవిచ్
- కోహ్లీ తనకు మంచి స్నేహితుడన్న టెన్నిస్ దిగ్గజం
- త్వరలోనే భారత్‌లో పర్యటించి కోహ్లీతో కలిసి టెన్నిస్, క్రికెట్ ఆడతానని ప్రకటన
- భారత అభిమానుల నుంచి లభిస్తున్న ప్రేమకు, మద్దతుకు జొకోవిచ్ కృతజ్ఞతలు

**డిడి9 వార్త:**

టెన్నిస్ ప్రపంచంలో తిరుగులేని రారాజుగా వెలుగొందుతున్న నోవాక్ జొకోవిచ్, టీమిండియా పరుగుల యంత్రం విరాట్ కోహ్లీపై ప్రశంసల వర్షం కురిపించాడు. అసలు తాను క్రికెట్ చూడటం ప్రారంభించడానికి కారణమే విరాట్ కోహ్లీ అని ఆయన వెల్లడించాడు. వీరిద్దరి మధ్య ఉన్న స్నేహబంధం, పరస్పర గౌరవం మరోసారి క్రీడా ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. లారియస్ వరల్డ్ స్పోర్ట్స్ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా జొకోవిచ్ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

"విరాట్ కోహ్లీ నా మంచి స్నేహితుడు. నేను ఎంతో గౌరవించే, ఆరాధించే వ్యక్తి. నిజం చెప్పాలంటే, అతని వల్లే నేను క్రికెట్‌ను ఫాలో అవ్వడం మొదలుపెట్టాను. అంతకుముందు నాకు క్రికెట్‌పై పెద్దగా అవగాహన లేదు. మేమిద్దరం తరచూ టచ్‌లో ఉంటాం" అని జొకోవిచ్ తెలిపాడు. 'టైమ్స్ నౌ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాలు పంచుకున్నారు. "భవిష్యత్తులో నేను భారత్‌కు వచ్చినప్పుడు, అతను నాతో కలుస్తాడని ఆశిస్తున్నాను. ఇద్దరం కలిసి సరదాగా కాసేపు టెన్నిస్, మరికాసేపు క్రికెట్ ఆడతాం. క్రీడాస్ఫూర్తిని చాటుతూ మంచి సందేశాన్ని అందిస్తాం" అని తన కోరికను బయటపెట్టాడు.

ఈ సందర్భంగా భారత అభిమానులకు కూడా జొకోవిచ్ ఒక సందేశం పంపాడు. "గత కొన్నేళ్లుగా భారత క్రీడాభిమానుల నుంచి నాకు లభిస్తున్న ప్రేమ, మద్దతుకు నేను ఎంతో రుణపడి ఉంటాను. త్వరలోనే మిమ్మల్ని భారత్‌లో కలుస్తాను. గత రెండేళ్లుగా భారత్‌ను సందర్శించాలని నా మనసు బలంగా చెబుతోంది. అక్కడ ఒక ఈవెంట్ నిర్వహించడం లేదా ఒక మ్యాచ్ ఆడటం వంటివి చేయాలని ఉంది. భారత ప్రజలతో నాకు తెలియని ఒక అనుబంధం ఉంది" అని జొకోవిచ్ పేర్కొన్నాడు.

'బిగ్ 3' మధ్య ఉన్న పోటీనే ఎప్పటికీ గొప్పది

ఇదే సమయంలో టెన్నిస్‌లో యువ సంచలనాలు కార్లోస్ అల్కరాజ్, జానిక్ సిన్నర్‌లతో తన ప్రత్యర్థిత్వం గురించి కూడా జొకోవిచ్ మాట్లాడారు. సిన్నర్, అల్కరాజ్‌ల మధ్య పోటీ అద్భుతంగా ఉన్నప్పటికీ, తన దృష్టిలో టెన్నిస్‌లో 'బిగ్ 3' (ఫెదరర్, నాదల్, జొకోవిచ్) మధ్య ఉన్న పోటీనే ఎప్పటికీ గొప్పదేనని జొకోవిచ్ స్పష్టం చేశాడు.






## సెలబ్రిటీల క్లబ్‌లో చేరిన నితీశ్ రెడ్డి..
## కొత్త రేంజ్ రోవర్ కారుతో హల్‌చల్

- కొత్త రేంజ్ రోవర్ లగ్జరీ కారు కొన్న సన్‌రైజర్స్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి
- కుటుంబంతో కలిసి బాటూమీ గోల్డ్ రంగు కారులో చక్కర్లు
- ప్రముఖ బాలీవుడ్ తారలు వాడే కారును సొంతం చేసుకున్న యువ క్రికెటర్
- అత్యాధునిక ఫీచర్లు, శక్తిమంతమైన ఇంజిన్ ఈ కారు సొంతం

**డిడి9 వార్త:**

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) తరపున అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి, తన విజయానికి గుర్తుగా ఓ ఖరీదైన కారును సొంతం చేసుకున్నాడు. 22 ఏళ్ల ఈ యువ కెరటం, ప్రముఖ లగ్జరీ ఎస్‌యూవీ అయిన రేంజ్ రోవర్ ఆటోబయోగ్రఫీని కొనుగోలు చేశాడు. ఈ కారుతో బాలీవుడ్ తారలు కంగనా రనౌత్, సంజయ్ దత్, శిల్పా శెట్టి, జాన్వీ కపూర్ వంటి ప్రముఖుల సరసన నిలిచాడు.

ఇటీవల చెన్నై సూపర్ కింగ్స్‌పై హైదరాబాద్ 10 పరుగుల తేడాతో విజయం సాధించడంలో నితీశ్ రెడ్డి తన అద్భుత బౌలింగ్‌తో కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఈ విజయం తర్వాత అతను తన కుటుంబంతో కలిసి సరికొత్త రేంజ్ రోవర్ కారులో షికారు చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. బాటూమీ గోల్డ్ రంగులో మెరిసిపోతున్న ఈ ఎస్‌యూవీని డీలర్ నుంచి తీసుకుంటున్న దృశ్యాలు ఇప్పుడు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.

**రేంజ్ రోవర్ ఆటోబయోగ్రఫీ ప్రత్యేకతలు:**

నితీశ్ కొనుగోలు చేసిన ఈ లగ్జరీ కారులో అత్యాధునిక ఫీచర్లు ఉన్నాయి. దీని టాప్ వేరియంట్‌లో 4.4లీటర్ వీ8 ఇంజిన్ అమర్చారు. ఇది 522 హార్స్‌పవర్ శక్తిని, 750 Nm టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. మైల్డ్ హైబ్రిడ్ టెక్నాలజీతో పనిచేసే ఈ కారు కేవలం 4.6 సెకన్లలోనే 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. దీని గరిష్ఠ వేగం గంటకు 250 కిలోమీటర్లు. నితీశ్ రెడ్డి ఏ ఇంజిన్ వేరియంట్‌ను ఎంచుకున్నాడనే విషయంపై స్పష్టత లేదు.

ఇక, కారు లోపల సౌకర్యాలకు కొదవే లేదు. పవర్ అడ్జస్ట్‌మెంట్, మసాజ్ ఫంక్షన్లతో కూడిన సీట్లు, పీవీ ప్రో ఇన్ఫోటైన్‌మెంట్ కోసం కర్వ్డ్ టచ్‌స్క్రీన్, వైర్‌లెస్ యాపిల్ కార్‌ప్లే, ఆండ్రాయిడ్ ఆటో వంటి సదుపాయాలు ఉన్నాయి. మెరిడియన్ 29స్పీకర్ సరౌండ్ సౌండ్ సిస్టమ్, ఫోర్‌జోన్ క్లైమేట్ కంట్రోల్, వెనుక ప్రయాణికుల కోసం ఎగ్జిక్యూటివ్ క్లాస్ సీటింగ్ వంటివి ఇందులో ప్రధాన ఆకర్షణలు. భద్రత కోసం 360డిగ్రీ కెమెరా, డైనమిక్ స్టెబిలిటీ కంట్రోల్ (DSC), మల్టిపుల్ ఎయిర్‌బ్యాగ్స్, అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ (ADAS) వంటివి ఉన్నాయి. మైదానంలో తన ప్రతిభతో దూసుకుపోతున్న నితీశ్, ఇప్పుడు ఈ లగ్జరీ కారుతో తన కెరీర్‌లో మరో మైలురాయిని అందుకున్నాడు.






## జిల్లాలో సొనాల ఆదర్శ మండలంగా నిలవాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు కృషి .

**ఆదిలాబాద్, బోథ్ ఏప్రిల్ 21(డిడి9 వార్త):-**

అదిలాబాద్ లోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్ ను మంగళవారం. మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, సుదీర్ రెడ్డి, ఉప సర్పంచ్ తుల శ్రీకాంత్, యువ నాయకుడు ఈర్ల అభిలాష్ తో కలిసి మర్యాద పూర్వకంగా కలవటం జరిగింది. గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల గురించి ఎస్పీ కి వివరించడం జరిగింది. గ్రామంలో ప్లాస్టిక్ ను నిషేధిస్తూ స్టీల్ ప్లేట్ లను, గ్లాస్ లను ఏర్పాటు చేస్తున్నామని, ఆటో డ్రైవర్ లకు ఇన్సూరెన్స్ చేస్తున్నామని ఎస్పీ కి వివరించడం జరిగింది. మండల కేంద్రంలో పోలీసు స్టేషన్ ఏర్పాటు చెయ్యాలని విన్నవించగా త్వరలో మండల కేంద్రంలో ఔట్ పోస్ట్ ఏర్పాటు చేస్తామని ఎస్పీ తెలిపారు. అతి త్వరలో గ్రామంలో పర్యటిస్తామని హామీ ఇచ్చారు. తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ సేవలు అభినందనీయమని, సొసైటీ చేసే సేవలు ప్రజలకు ఉపయోగపడేలా ఉన్నాయన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో మరిన్ని సేవలు అందించాలని అన్నారు. హెల్మెట్ పై అవగాహన కల్పించి హెల్మెట్ లను పంపిణీ చెయ్యాలని ఎస్పీ సూచించగా, సొసైటీ ఆధ్వర్యంలో హెల్మెట్ లను పంపిణీ చేస్తామని మాజీ ఎంపీపీ ఎస్పీకి తెలుపగా అభినందించారు.



## ఉప్పల్ స్టేడియంలో నిమ్మకాయ మాయ.. నిజంగా మంత్రం వేశాడా?.. వైరల్ వీడియోపై క్లారిటీ ఇచ్చిన సతీష్!

- ఐపీఎల్ మ్యాచ్‌లో నిమ్మకాయతో మంత్రం వేస్తున్న వీడియో వైరల్
- శివమ్ దూబే బ్యాటింగ్ చేస్తుండగా ఘటన.. వెంటనే వికెట్
- వీడియోతో రాత్రికి రాత్రే ఫేమస్ అయిన యూట్యూబర్ సతీష్
- అది మ్యాజిక్ కాదని.. వీడియో కోసమే చేశానని క్లారిటీ

**డిడి9 వార్త:**


ఐపీఎల్ మ్యాచ్‌లు అంటేనే ఎన్నో ఆసక్తికర సంఘటనలకు వేదిక. తాజాగా సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఓ వీడియో సోషల్ మీడియాను షేక్ చేసింది. ఓ యూట్యూబర్ నిమ్మకాయతో మంత్రం వేసినట్లు నటించడం, ఆ వెంటనే వికెట్ పడటంతో అతను రాత్రికి రాత్రే ఫేమస్ అయ్యాడు.

వివరాల్లోకి వెళితే... 'సన్నీ టాక్స్' ఫేమ్, యూట్యూబర్ సతీష్.. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో ఈ మ్యాచ్ చూసేందుకు వెళ్లాడు. చెన్నై బ్యాటర్ శివమ్ దూబే క్రీజులో ఉన్నప్పుడు, సతీష్ తన చేతిలో ఉన్న నిమ్మకాయను చూపిస్తూ ఏదో మంత్రం చదువుతున్నట్లు నటించాడు. ఆశ్చర్యకరంగా ఆ తర్వాతి బాల్‌కే దూబే క్లీన్ బౌల్డ్ అయ్యాడు. దీంతో మ్యాచ్ హైదరాబాద్ వైపు మొగ్గు చూపింది. ఈ దృశ్యాలు రికార్డ్ కావడంతో వీడియో 'ఎక్స్' (ట్విట్టర్)తో పాటు ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వైరల్‌గా మారింది.

వీడియో వైరల్ కావడంతో సతీష్‌కు ఊహించని పాపులారిటీ వచ్చింది. మీడియా సంస్థలు కూడా అతడిని సంప్రదించాయి. ఈ సందర్భంగా సతీష్ అసలు విషయం వెల్లడించాడు. తాను ఎలాంటి మంత్రం వేయలేదని స్పష్టం చేశాడు. కేవలం ఫన్నీ వీడియో కోసం నాలుగైదు సార్లు ప్రయత్నించగా, చివరి సారికి వికెట్ పడిందని చెప్పాడు. తన రియాక్షన్ కూడా ఒరిజినల్‌గా ఉండటం, దాన్ని నీట్‌గా ఎడిట్ చేసి పోస్ట్ చేయడంతో వైరల్ అయిందని వివరించాడు.



ఏదేమైనా ఈ ఒక్క వీడియోతో సతీష్ ఇప్పుడు 'నిమ్మకాయ మంత్రగాడు'గా సోషల్ మీడియాలో సెన్సేషన్ అయ్యాడు. తాను సరదాకి చేసిన పని ఈ స్థాయిలో పాప్యులర్ అవుతుందని ఊహించలేదని అతను పేర్కొన్నాడు.




# ఎన్టీఆర్ - నీల్ రిలీజ్ డేట్ ఫిక్స్..

ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబోలో వస్తున్న పాన్ ఇండియా సినిమా పై అనౌన్స్మెంట్ నుంచే భారీ అంచనాలున్నాయి. అయితే, ఈ సినిమా షూటింగ్ మొదలై చాలా కాలం అవుతోంది. కానీ ఇంకా సగానికి పైగా షూటింగ్ బ్యాలెన్స్ ఉన్నట్టుగా తెలుస్తోంది. మరి ఇంత స్లోగా నడుస్తున్న ఈ సినిమా.. ఇదే ఏడాదిలో రిలీజ్ అవుతుందా? అంటే, లేదనే మాట వినిపిస్తోంది. మొదట 2026 జూన్‌లో విడుదల అవుతుందని మేకర్స్ ప్రకటించారు. ప్రశాంత్ నీల్ భారీ స్థాయిలో చిత్రీకరించే యాక్షన్ సన్నివేశాలకు తోడు.. క్వాలిటీ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కావడం లేదట.

అందుకే.. డ్రాగన్ డిలే అవుతు వస్తోంది. గతంలో 2026 జూన్ 25న సినిమా విడుదలవుతుందని మేకర్స్ ప్రకటించినా ఫ్యాన్స్ కు షాక్ ఇస్తూ ఇప్పుడు 2027కి వెళ్లిపోయింది. తాజాగా ఈ సినిమా ను 2027జూన్ 11 రిలీజ్ చేస్తున్నారు అఫీషియల్ గా ప్రకటిచారు. అలాగే మే 20న ఎన్టీఆర్ బర్త్ డే సందర్భంగా ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్ ను టిలీజ్ చేస్తున్నారు. అందుకోసం ఇప్పటికే వపర్ ఫుల్ గ్లింప్స్ కట్ చేసి ఉంచారు. ఈ విషయాన్ని కూడా అఫీషియల్ గా ప్రకటించారు. ఈ సినిమా కోసం ఎన్టీఆర్ సరికొత్తగా మేకోవర్ అవుతున్నాడు. భారీగా వెయిట్ లాస్ అయి, కండలు తిరిగిన దేహంతో కనిపిస్తున్నాడు. దీంతో.. డ్రాగన్ ఫస్ట్ లుక్ కోసం ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు టైగర్ ఫ్యాన్స్. పక్కా ప్రశాంత్ నీల్ మార్క్ పవర్ ఫుల్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో.. కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

# జోష్‌లో 'జైలర్ 2' టీమ్.. షూటింగ్ పూర్తి




మాఫియా, ప్రతీకార నేపథ్యం, కుటుంబ అంశాల మేళవింపుగా రూపొంది ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న చిత్రం 'జైలర్'. దీనికి కొనసాగింపుగా 'జైలర్ 2' వస్తోన్న సంగతి తెలిసిందే. అగ్రహీరో రజనీకాంత్ ప్రధాన పాత్రలో నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ పూర్తయినట్లు తెలుపుతూ టీమ్ కొన్ని ఫొటోలు పంచుకుంది. భారీ స్థాయిలో ఇది రానున్నట్లు తెలిపింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఈ సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. త్వరలోనే విడుదల తేదీని కూడా టీమ్ వెల్లడించనున్నట్లు తెలుస్తోంది.

విడుదలకు సిద్ధమవుతోన్న వేళ ఇటీవల ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు లీక్ కావడం చిత్ర యూనిట్‌ను ఆవేదనకు గురిచేసింది. 'జైలర్2' సెట్లో తీసిన కొన్ని సన్నివేశాలు సోషల్ మీడియాలో లీకయ్యాయి. ఈ వీడియోను షేర్, ప్రచారం చేసిన ఖాతాలకు వ్యతిరేకంగా చట్టపరమైన చర్యలు చేపట్టడంతో పాటు బయటకు వచ్చిన సన్నివేశాల వీడియోను ఆ ఖాతాల నుంచి తొలగించడానికి అవసరమైన చర్యలను చేపట్టినట్లు నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ప్రకటించింది.

# 'జన నాయగన్' సాఫీగా విడుదలై ఉంటే ఆశ్చర్యం



తన కుమారుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ నటించిన 'జన నాయగన్' కాంట్రవర్సీపై ఎస్.ఎ. చంద్రశేఖర్ స్పందించారు. ఈ సినిమా సెన్సార్ సర్టిఫికెట్ జాప్యం, లీక్‌పై తామేమీ ఆందోళన పడలేదని, ఈ సమస్యలు తాము ఊహించినవే అని అన్నారు. ఒకవేళ మూవీ సాఫీగా విడుదలై ఉంటే ఆశ్చర్యపోయేవాళ్లం పేర్కొన్నారు.

''నేను రాజకీయాల్లోకి వెళుతున్నప్పుడు మీరు నాతో సినిమా చేయాలనుకుంటున్నారు. కాబట్టి ఈ చిత్రం విషయంలో ఎదురయ్యే అడ్డంకులపై మీకు అవగాహన ఉందని అనుకుంటున్నా. దీనికి ఓకేనా?' సినిమాని ఖరారు చేయబోయే ముందు నిర్మాతను విజయ్ అడిగాడు. ఇబ్బందులు తలెత్తుతాయని విజయ్‌కు తెలుసు. రాజకీయ ప్రత్యర్థి కావడంతో విజయ్ మూవీని లీక్ చేశారు'' అని ఆరోపించారు. కుటుంబమా? ప్రజలా? అంటే విజయ్ ఓటు ప్రజలకే అని అన్నారు.

విజయ్ హీరోగా దర్శకుడు హెచ్. వినోద్ తెరకెక్కించిన ఈ చిత్రం జనవరిలోనే విడుదల కావాల్సి ఉంది. సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడంతో వాయిదా పడుతూ వస్తోంది. ఈ క్రమంలో ఇటీవల ఆన్‌లైన్‌లో కొన్ని సన్నివేశాలు లీక్ కాగా.. కోయంబత్తూరులోని ఓ లోకల్ ఛానల్‌లో మూవీ ప్రసారం కావడం కోలీవుడ్‌ను కలవర పెట్టింది. ఈ కేసుల్లో ప్రధాన నిందితులు అరెస్టు అయిన సంగతి తెలిసిందే.



# ఇమ్రాన్‌తో కెమిస్ట్రీ అదిరిపోవాల్సిం-

బాలీవుడ్ గ్లామర్ క్వీన్ దిశా పటానీ ఇప్పుడు ఒక సెన్సేషనల్ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది. ఇమ్రాన్ హష్మీ కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన 'ఆవారాపన్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'ఆవారాపన్ 2'లో దిశా హీరోయిన్‌గా నటిస్తోంది. 'ఆవారాపన్ 2' చిత్రంలో దిశా పటానీ భాగం కావడంతో సినిమా స్థాయి మరింత పెరిగిందని చిత్ర బృందం భావిస్తోంది. నిర్మాత విశేష్ భట్ మాట్లాడుతూ.. "దిశా పటానీ ఈ ప్రాజెక్ట్‌లో చేరడం వల్ల 'ఆవారాపన్' ప్రపంచం సరికొత్త అవకాశాలకు వేదికైంది'' అని ప్రశంసించారు. కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, ఇమ్రాన్ హష్మీ సరసన అత్యంత పవర్‌ఫుల్, ఎమోషనల్ పాత్రలో దిశా మెరిసిపోనుంది. వీరిద్దరి మధ్య ఉండే కెమిస్ట్రీ, దిశా యాక్షన్ సీక్వెన్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని సమాచారం.

ఇమ్రాన్ హష్మీ సినిమాలంటేనే పాటలు ఒక రేంజ్‌లో ఉంటాయి. ఈ సీక్వెల్‌లో కూడా దిశా పటానీపై చిత్రీకరించే పాటలు మళ్ళీ పాత 'ఆవారాపన్' మ్యాజిక్‌ను తీసుకువస్తాయని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. నితిన్ కక్కర్ దర్శకత్వంలో రాబోతుంది. విశేష్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ డ్రామా ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతోంది. స్వాతంత్ర్య దినోత్సవ వీకెండ్‌లో విడుదలవుతున్న ఈ సినిమాకు బాక్సాఫీస్ వద్ద గట్టి పోటీ ఎదురు కానుంది. సన్నీ డియోల్ నటించిన 'లాహోర్ 1947' ఆగస్టు 13న విడుదల కాబోతుండగా, మరుసటి రోజే దిశా తన 'ఆవారాపన్ 2'తో థియేటర్లలోకి రానుంది. ఒకవైపు సన్నీ డియోల్ మాస్ పవర్, మరోవైపు దిశా పటానీ గ్లామర్ అండ్ యాక్షన్.. ఈ పోటీ బాలీవుడ్‌లో ఆసక్తికరంగా మారింది.



SAI PALLAVI

# నేను ఎప్పుడూ ఏ భాషనూ చిన్నచూపు చూడను

సౌత్ ఇండస్ట్రీలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సాయిపల్లవి, తన అద్భుతమైన నటనతో తెలుగు, తమిళ, మలయాళ ప్రేక్షకులను అలరిస్తోంది. ప్రస్తుతం 'రామాయణ'లో సీతగా నటిస్తూ బాలీవుడ్‌లోనూ అడుగుపెడుతున్న ఈమె, తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన గురించి జరిగిన ఒక తప్పుడు ప్రచారంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గతంలో ఒక ప్రెస్ మీట్‌లో తాను చెప్పిన మాటలను మీడియా వక్రీకరించడం తనను ఎంతగానో బాధించిందని ఆమె పేర్కొన్నారు. నాలుగేళ్ల క్రితం జరిగిన ఒక ప్రెస్ మీట్‌లో, "మలయాళ నటీనటులు తమిళం ఇంత బాగా ఎలా మాట్లాడగలరు?" అని ఒక రిపోర్టర్ అడిగారు. దానికి సాయిపల్లవి చాలా నిజాయితీగా, "నేను మలయాళీని కాను, తమిళ అమ్మాయిని" అని మాత్రమే చెప్పారట. అయితే, రెండేళ్ల తర్వాత ఒక పత్రికలో "తనను మలయాళీ అని పిలిచినందుకు సాయిపల్లవికి కోపం వచ్చింది" అని హెడ్‌లైన్ వేయడం ఆమెను దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపింది. దీని వల్ల ఆమె మలయాళ భాషను ద్వేషిస్తుందనే ఒక తప్పుడు ముద్ర పడిందని అది తనను చాలా భాద పెట్టిందని అన్నారు.

ఈ విషయాన్ని వివరిస్తూ సాయి పల్లవి ఒక చేదు అనుభవాన్ని పంచుకున్నారు. ఎయిర్‌పోర్ట్‌లో ఒక మహిళ ఆమెతో మలయాళంలో మాట్లాడటానికి సంకోచిస్తూ, "మీకు కోపం వస్తుందేమో" అని అడగడం ఆమెను కలచివేసింది. "నేను ఎప్పుడూ ఏ భాషను చిన్నచూపు చూడలేదు. నా మాతృభాష తమిళం అని మాత్రమే చెప్పాను. అది నా పుట్టుక గురించి ఇచ్చిన క్లారిటీ మాత్రమే కానీ, ఏ భాష మీదో నాకు ద్వేషం లేదు. నన్ను తప్పుగా అర్థం చేసుకున్నారు" అని సాయిపల్లవి స్పష్టం చేశారు. కోయంబత్తూరులో పెరిగిన తాను అన్ని భాషలను గౌరవిస్తానని, తన మాటలను వక్రీకరించడం వల్ల సాధారణ ప్రజల్లో తన పట్ల తప్పుడు అభిప్రాయం ఏర్పడటం బాధాకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సెలబ్రిటీల గురించి వచ్చే వార్తల్లో వాస్తవం ఎంత ఉందో తెలుసుకోకుండా ప్రచారం చేయడం వల్ల వారి వ్యక్తిగత ఇమేజ్ ఎలా దెబ్బతింటుందో చెప్పడానికి ఈ సంఘటన ఒక నిదర్శనం అని చెప్పుకొచ్చింది.

# సిద్ధూ జొన్నలగడ్డకు జోడీగా మీనాక్షి చౌదరి?

టాలీవుడ్ యంగ్ హీరో సిద్ధూ జొన్నలగడ్డ, స్టార్ డైరెక్టర్ వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో నెట్‌ఫ్లిక్స్ కోసం రూపొందుతున్న భారీ వెబ్ సిరీస్‌లో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా ఎంపికవ్వడం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. వరుస బ్లాక్ బస్టర్ హిట్లతో దూసుకుపోతున్న ఈ అందాల తార, ఇప్పుడు డిజిటల్ ప్రపంచంలోకి కూడా తనదైన శైలిలో అడుగుపెట్టబోతోంది. గత కొద్ది కాలంగా మీనాక్షి చౌదరి తెలుగులో తిరుగులేని ఫామ్‌లో ఉంది. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో అమ్మడు రేంజ్ మారిపోయింది. కేవలం కమర్షియల్ సినిమాలే కాకుండా, నటనకు అవకాశం ఉన్న పాత్రలను కూడా ఎంచుకుంటూ ప్రేక్షకులకు దగ్గరవుతోంది. అందుకే, ఇప్పుడు ఈ ప్రతిష్టాత్మక వెబ్ సిరీస్‌లో మీనాక్షిని తీసుకోవడం పట్ల మేకర్స్ చాలా ఎగ్జైట్‌గా ఉన్నారు. సిద్ధూ బాడీ లాంగ్వేజ్‌కు, మీనాక్షి గ్లామర్ అండ్ యాక్టింగ్ తోడైతే ఈ సిరీస్ మరో స్థాయికి వెళ్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వీరిద్దరి కాంబినేషన్ స్క్రీన్‌పై చాలా ఫ్రెష్‌గా ఉంటుందని టాక్. ఈ వెబ్ సిరీస్‌ను ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. గ్లోబల్ ఆడియన్స్‌ను దృష్టిలో ఉంచుకుని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఈ సిరీస్‌ను తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే తన నటనతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన మీనాక్షి చౌదరి, ఈ వెబ్ సిరీస్‌తో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకోవడం ఖాయం. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సిరీస్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మొత్తానికి, స్టార్ బాయ్ సిద్ధూతో మీనాక్షి చౌదరి ఆన్‌స్క్రీన్ రొమాన్స్ చూడటానికి ఫ్యాన్స్ ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.



# 'ప్యారడైజ్' కోసం రెండేళ్లు అంకితం.. కాయదు లోహర్ రిస్క్ సక్సెస్ అవుతుందా?

తెలుగు సినీ పరిశ్రమలో ఒకే సినిమాకు ఏళ్ల తరబడి సమయం కేటాయించడం అరుదైన విషయం. గతంలో "బాహుబలి" వంటి భారీ ప్రాజెక్ట్ కోసం అనుష్క శెట్టి తన కెరీర్‌లో ఐదు సంవత్సరాలను కేటాయించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే తరహాలో యువ నటి కాయదు లోహర్ కూడా సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. నేచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కుతున్న "ప్యారడైజ్" సినిమా కోసం కాయదు లోహర్ దాదాపు రెండేళ్లుగా మరే ఇతర ప్రాజెక్ట్‌కి కమిట్ కాకుండా పూర్తిగా ఈ ఒక్క సినిమాపైనే దృష్టి పెట్టింది. ఎదుగుతున్న హీరోయిన్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం పెద్ద రిస్క్‌గా సినీ వర్గాలు భావిస్తున్నాయి.

ఇటీవల కాయదు లోహర్ నటించిన కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. అలాంటి సమయంలో కొత్త అవకాశాలను పక్కన పెట్టి ఒక్క ప్రాజెక్ట్‌పైనే ఆధారపడటం ఆమె కెరీర్‌కు సవాల్‌గా మారవచ్చని విశ్లేషకులు అంటున్నారు. ఒకవేళ "ప్యారడైజ్" ఆశించిన స్థాయిలో హిట్ కాకపోతే, దాని ప్రభావం ఆమె భవిష్యత్తుపై పడే అవకాశముంది. అయితే ఈ సినిమాలో కాయదు పాత్ర కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, నటనకు మంచి స్కోప్ ఉన్నట్టుగా తెలుస్తోంది. భావోద్వేగపూరిత సన్నివేశాల్లో తన ప్రతిభను చూపించే మంచి ఛాన్స్ ఆమెకు దక్కిందని సమాచారం. ఇదే కారణంగా ఆమె ఈ ప్రాజెక్ట్‌కి అంత సమయం కేటాయించినట్లు తెలుస్తోంది.

నాని వంటి ప్రతిభావంతుడితో స్క్రీన్ షేర్ చేసుకోవడం కూడా కాయదు కెరీర్‌కు ప్లస్ అవుతుందని భావిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమా సక్సెస్ అయితే, కాయదు లోహర్‌కు పెద్ద బ్రేక్ వచ్చే అవకాశం ఉంది. మరోవైపు పరిశ్రమలో వరుస సినిమాలు చేయడం కూడా నటీమణుల కెరీర్‌కు ముఖ్యమే. ఒకే ప్రాజెక్ట్‌పై ఎక్కువ కాలం ఆధారపడితే ఇతర అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. గతంలో "సైజ్ జీరో" కోసం అనుష్క తీసుకున్న రిస్క్ తర్వాత ఆమె కొంతకాలం గ్యాప్ తీసుకోవాల్సి వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాయదు లోహర్ తీసుకున్న ఈ నిర్ణయం సక్సెస్ అవుతుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. "ప్యారడైజ్" విడుదల తర్వాత ఆమె టాలీవుడ్‌లో టాప్ లీగ్‌లో చేరుతుందా అనే ప్రశ్నకు సమాధానం దొరకనుంది.

